సాతాపూర్‌లో కాంగ్రెస్ నేతల చేతిలో గాయపడిన పరమేశ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

బీఆర్ఎస్ నేతపై కాంగ్రెస్ దాడి

- కొల్లాపూర్ నియోజకవర్గం సాతాపూర్‌లో స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తుండగా 50 మంది దాడి
- గాయపడిన పరమేశ్‌కు దవాఖానలో చికిత్స.. డిశ్చార్జి
- పరమేశ్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీలు కే కవిత, నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం

కాంగ్రెస్ కార్యకర్తల చేతిలో గాయపడిన మాజీ డైరెక్టర్ గుజ్జుల పరమేశ్ ఒంటిపై గాయాలు

నాగర్‌కర్నూల్/కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 28: కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ దాడులు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి హత్యా ఘటన మరవకముందే, నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌లో బీఆర్ఎస్ నేత, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుజ్జుల పరమేశ్‌నాయుడుపై దాడి జరిగింది. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం సింగోటం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, పరమేశ్‌నాయుడు గురువారం రాత్రి సాతాపూర్‌లో స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటుచేయిస్తున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ నేత శివరావుతోపాటు 50 మంది కలిసి ఆయనపై దాడి చేశారు. ఈ దాడిలో పరమేశ్‌నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. అక్కడే ఉన్న గ్రామస్తులు కలుగజేసుకొని అడ్డుకోవడంతో పరమేశ్‌నాయుడు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు ఆయనను నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆయనకు చికిత్స అందించిన వైద్యులు శుక్రవారం దవాఖాన నుంచి డిశ్చార్జి చేశారు. దాడి సమయంలో పోలీసులు అక్కడే ఉన్నా అడ్డుకోలేదని, పోలీస్ వ్యవస్థ అధికార పార్టీ కనుసన్నలో పనిచేస్తున్నదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. పరమేశ్‌నాయుడుపై కాంగ్రెస్ కార్యకర్తలు గతంలోనూ దాడులు చేశారు. 2023 నవంబర్ 29వ తేదీన పోలింగ్ ఉన్న రోజు బీఆర్ఎస్ శ్రేణులను, ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు పరమేశ్‌నాయుడు ఇంటిపై కొందరు దుండగులు దాడి చేశారు. కార్యకర్తల సహాయంతో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులతో తనకు ప్రాణహాని ఉన్నదంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్సీ కవిత పరామర్శ

కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడిన గుజ్జుల పరమేశ్‌నాయుడును శుక్రవారం ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. ఇలాంటి దాడులకు భయపడవద్దని, ధైర్యంగా ఉండాలని కవిత ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పథకాలపై విమర్శలు చేస్తున్నాడన్న కోపంతోనే కాంగ్రెస్ నేతలు అదును చూసి దాడికి పాల్పడ్డారని విమర్శించారు. తన పర్యటన సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ దుండగులు దాడి చేయడం హేయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. పరమేశ్‌పై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు హత్యా రాజకీయాలను మానుకోవాలని హితవు చెప్పారు.

కాకి లెక్కలు కాదు.. కచ్చితత్వం కావాలి

- బీసీలకు 46 శాతం రిజర్వేషన్ కల్పించాలి
- మూడింటికీ వేర్వేరుగా బిల్లులు పెట్టాలి
- బీసీ సంఘాల రౌండ్‌టేబుల్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నాగర్‌కర్నూల్‌లో బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్, బీసీ సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్/కొల్లాపూర్, ఫిబ్రవరి 28 : కాంగ్రెస్ సర్కారు కాకిలెక్కలు పక్కనపెట్టి బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో వేర్వేరుగా 46% రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో 46% రిజర్వేషన్లు కల్పిస్తూ వేర్వేరు బిల్లులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఒక్కటే బిల్లు పెడితే మొదటికే మోసం వస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే తప్పుల తడకగా ఉన్నదని విమర్శించారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో బీసీలు 52% ఉన్నట్టు తేలగా, ప్రస్తుత కాంగ్రెస్ చేసిన సర్వేలో 46% ఉన్నట్టు ఎలా చెప్తారని, ఈ వ్యత్యాసం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. బీసీ జనాభాను తగ్గించి చూపించేందుకు రేవంత్ సర్కారు బీసీ కులగణన చేపట్టినట్టున్నదని దుయ్యబట్టారు. బీసీలను మోసం చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. మూడు బీసీ బిల్లులు వచ్చే వరకు తగ్గేదే లేదని, పోరాటాలు చేస్తామని స్పష్టంచేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా బీసీ హక్కులకు రాజ్యాంగ రక్షణ రాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీసీలకు రాజ్యాంగ రక్షణ కల్పించి ఉంటే అభివృద్ధిలో ఇండియా అమెరికాను దాటిపోయేదని చెప్పారు. దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బైకని శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీసీలకు జరుగుతున్న అన్యాయాల గురించి వివరించారు. ఇంతకాలం బీసీలకు సరైన రిజర్వేషన్ లేక ఎంతో నష్టపోయామని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వివరించాల్సిన అవసరమున్నదని చెప్పారు. బీసీ కులాలను ఐక్యం చేయడానికి ఎమ్మెల్సీ కవిత చేస్తున్న ప్రయత్నానికి వివిధ సంఘాల నాయకులతో కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు కుర్మయ్య, గోపీగౌడ్, యాదగిరి, ప్రనీల్‌కుమార్‌సాగర్, మనోహర్ యాదవ్, రాములు, సుభాష్, శ్రీనివాస్‌యాదవ్, సదానందం తదితరులు మాట్లాడారు.

పింక్‌బుక్‌లో చిట్టా రాస్తున్నం

'ముఖ్యమంత్రి సొంత జిల్లా మహబూబ్‌నగర్ గడ్డ మీది నుంచి చెప్తున్నా.. మేము కూడా పింక్‌బుక్ మెయింటెన్ చేస్తున్నం. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడి చేసిన వారి చిట్టా రాస్తున్నం.. మా టైం వస్తది.. అప్పుడు మీ సంగతి తేలుస్తం'.. అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ సమీపంలోని సింగోటం లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి ఆమె పూజలు చేశారు. అనంతరం సింగోటం, నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సింగోటం ఆలయ అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం రూ.17 కోట్లు మంజూరు చేస్తే దేవుడికిచ్చిన డబ్బులను జూపల్లి కృష్ణారావు క్యాన్సిల్ చేయించారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి హత్యకు గురై ఇన్ని రోజులైనా కేసును ఇంకా ఛేదించలేదని, సాతాపూర్‌లో బీఆర్ఎస్ నేత పరమేశ్‌పై దాడి చేశారని పేర్కొన్నారు. కొల్లాపూర్ నుంచి మామిడి ఎగుమతి కోసం గత ప్రభుత్వం మార్కెట్‌ను మంజూరు చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

జనగణనతోపాటు కులగణన చేపట్టాలి

- ప్రధాని మోదీ వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో బీసీసంఘాల నేతల డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : బీసీ బిడ్డ ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కులగణన చేపట్టాలని పలువురు రాజకీయ నాయకులు, బీసీ సంఘాల నేతలు, మేధావులు డిమాండ్ చేశారు. జనాభా ప్రతిపాదికన చట్టసభలతోపాటు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేసి దశాబ్దాల కాలంగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురవుతున్న వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో 'దేశ జనగణనలో కులగణన, బీసీలకు చట్టసభల్లో 5 శాతం రిజర్వేషన్లు, జనాభా ప్రతిపాదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. డిమాండ్ల సాధనకు జేఏసీగా ఏర్పడి ఉద్యమాలు నిర్మించేందుకు ముందుకు రావాలని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. బీసీల వెనుకబాటుతనం అంతం కావాలంటే వారికి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ప్రభుత్వాలు చేయూత అందించాల్సిన అవసరమున్నదని పేర్కొన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ.. బీసీ సమస్యల సాధనకు సీపీఐ పలు సందర్భాల్లో ప్రత్యక్ష ఉద్యమాల ద్వారా ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేశారని తెలంగాణ వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో రిజర్వేషన్లు కేవలం 50 శాతం మాత్రమే ఉండాలని సుప్రీంకోర్టు పరిధి విధించిందని, బీసీలంతా ఏకమైతే ఈ గీత ఇట్టే చెరిగిపోతుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టీ చిరంజీవులు పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ కులం ఏమిటి..? అని బీజేపీ నేతలు పదే పదే ప్రశ్నించడంపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. ప్రొఫెసర్లు మురళీమనోహర్, ప్రభంజన్‌యాదవ్, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ఉన్నారు.

సబ్‌స్టేషన్ ముట్టడి

మెదక్ జిల్లా కర్నాల్‌పల్లిలో స్థానికుల నిరసన

చేగుంట, ఫిబ్రవరి 28 : విద్యుత్తు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో స్థానికులు, రైతులు శుక్రవారం సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 15 రోజులుగా తరచూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందించకపోవడంతో సబ్‌స్టేషన్ వద్ద , ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ విషయమై చేగుంట ట్రాన్స్‌కో ఏఈ భరత్‌ను వివరణ కోరగా.. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

రేవంత్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- అధికార దుర్వినియోగంతో నియంతృత్వ పాలన
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని సీఎం రేవంత్ ఖూనీ చేస్తున్నారని బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. లేఖలో ఆయన పేర్కొన్న అంశాలు ఇలా ఉన్నాయి. 'హైదరాబాద్‌కు మీ ప్రచారరహిత, నిరాడంబరమైన రాక సాధారణ ప్రజానాయకత్వానికి ఉదాహరణ. ఎలాంటి హంగామా లేకుండా పూర్తిగా భిన్నంగా, మీరు చూపిస్తున్న వినయపూర్వక నాయకత్వాన్ని అభినందిస్తున్నాం. తెలంగాణ ఇప్పుడు ప్రజాస్వామ్యానికి దూరమవుతూ, పోలీసు రాజ్యం, తీవ్రమైన అవినీతికి నిలయంగా మారింది. 14 నెలల రేవంత్‌రెడ్డి పాలనలో, ప్రజాస్వామ్య వ్యవస్థలు నిర్వీర్యంగా మారాయి. ప్రభుత్వం రాజకీయ దౌర్జన్యం, వ్యక్తిగత లాభాలు, ప్రయోజనాలకు సాధనంగా మారింది. అవినీతి, కక్షసాధింపు, పరిపాలనా అస్తవ్యస్తంగా నిండిపోయాయి. ప్రభుత్వం న్యాయ వ్యవస్థ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. పోలీసుశాఖ, శాంతి భద్రతల పరిరక్షణకు కాకుండా, ప్రతిపక్ష నేతలు, సామాజిక ఉద్యమకారులు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వ్యక్తులపై ఒత్తిడి తెచ్చేందుకు వాడుతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రాజకీయ ఒత్తిడికి లొంగిపోతూ, కుట్రలకు పావులుగా మారారు. రైతుల సంక్షోభం, నిరుద్యోగ సమస్యలు, ఆర్థిక క్షీణత, సంక్షేమ పథకాల నిర్వీర్యత వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళికా లేదు. హామీలతో ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టినా, ప్రభుత్వాన్ని నడపడంలో రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారు. ఈ సంక్షోభ సమయంలో రాష్ట్ర ఇన్‌చార్జిగా రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని మళ్లీ మీరు పునరుద్ధరిస్తారని మేము ఆశిస్తున్నాం' అని లేఖలో దాసోజు పేర్కొన్నారు.

బల్మూరు పీఎస్‌లో ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న నాలుగు గ్రామాల రైతులు

ఎమ్మెల్యేపై పోలీస్ స్టేషన్‌లో రైతుల ఫిర్యాదు

- నీటిపారుదల శాఖ అధికారులపై, రిజర్వాయర్ పనులు ప్రారంభించడంపై ఆగ్రహం
- కోర్టు తీర్పును ధిక్కరించారని మండిపాటు

బల్మూరు, ఫిబ్రవరి 28 : తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ సమీపంలో ఉమామహేశ్వర రిజర్వాయర్ పనులను ప్రారంభించడంపై అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, నీటిపారుదల శాఖ అధికారులు, అధికార పార్టీ నాయకులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును ధిక్కరించి పనులు ప్రారంభించడం సబబుకాదని అన్నారు. కోర్టు తీర్పును సదరు ఎమ్మెల్యే, అధికారులు గౌరవించాలని సూచించారు. ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతుల సమస్యలు తెలుసుకోకుండా ఎమ్మెల్యేతోపాటు నీటి పారుదలశాఖ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కోర్టు తీర్పును ధిక్కరించిన ఎమ్మెల్యే, నీటిపారుదల శాఖ అధికారులపై కేసు నమోదు చేయాలని కోరుతూ శుక్రవారం వారు బల్మూర్ ఎస్సై రమాదేవికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుకు సంబంధించి తమకు రశీదు ఇవ్వాలని పోలీస్‌స్టేషన్ వద్ద నిరసనకు దిగారు. ఈ విషయమై ఎస్సై రమాదేవిని వివరణ కోరగా.. ఈ అంశం తన పరిధిలో లేదని, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించినట్టు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో అనంతవరం, బల్మూరు, మైలారం, అంబగిరి గ్రామాల రైతులు ఉన్నారు.

సాగు నీటికోసం రోడ్డెక్కిన రైతులు

జనగామ మండలం వడ్లకొండ గ్రామంలో నిరసన

జనగామ రూరల్, ఫిబ్రవరి 28 : పంటలకు సాగు నీరందించాలని డిమాండ్ చేస్తూ జనగామ మండలం వడ్లకొండ గ్రామంలో శుక్రవారం రైతులు రోడ్డెక్కారు. హుస్నాబాద్-జనగామ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తే చెరువులు, కుంటలు నిండితే పంటలకు చేరుతాయని అన్నారు. పొట్ట దశకు వచ్చిన పంటలకు నీళ్లిస్తే జీవం పోసినట్టు ఉంటుందని తెలిపారు. కండ్ల ముందు వేసిన పంటలు ఎండిపోతుంటే కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన చెందారు. లక్షల్లో అప్పు చేసి పంట వేస్తే నీరు లేక ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం గోదావరి జలాలు విడుదల చేస్తే ఉన్న పంటలైనా కాపాడుకుంటామని కోరుతున్నారు. రైతుల ధర్నాతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి రైతులతో చర్చించి ధర్నాను విరమింపచేశారు.

- ఖానాపూర్‌లో యూరియా కోసం తిప్పలు

నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. శుక్రవారం ఖానాపూర్ పీఏసీఎస్ కార్యాలయం వద్ద 200 మంది రైతులు క్యూకట్టగా.. అందరికీ యూరియా అందడం లేదంటూ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. సరిపడా యూరియాను ఎందుకు అందుబాటులో ఉంచడంలేదని అధికారులను నిలదీశారు. సరిపడాయూరియా పంపిణీ చేయకపోతే రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. - ఖానాపూర్

సాగునీటి కోసం అధికారుల నిర్బంధం

- నిజామాబాద్ జిల్లా సాలూర క్యాంప్‌లో ఘటన
- నిజాంసాగర్ చివరి ఆయకట్టుకు నీళ్లివ్వాలని డిమాండ్

నిజామాబాద్ జిల్లా సాలూర క్యాంప్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులను నిర్బంధించిన రైతులు

బోధన్ రూరల్, ఫిబ్రవరి 28: నిజాంసాగర్ ప్రాజెక్టు నీళ్లు చివరి ఆయకట్టుకు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో కడుపు మండిన రైతులు శుక్రవారం నీటిపారుదల శాఖ అధికారులను నిర్బంధించారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా సాలూర మండలం సాలూర క్యాంప్ గ్రామంలో చోటు చేసుకున్నది. నిజాంసాగర్ కెనాల్ డి-28 పరిధిలోని చివరి ఆయకట్టుకు నీటిని అందించి పంటలు కాపాడాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహానికిలోనైన రైతులు.. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులను నిర్బంధించారు. పంటలు ఎండిపోతున్నా స్పందించడం లేదని, అధికారుల నిర్లక్ష్యం వల్ల తమ పంటలు ఎండబెట్టుకోవాలా? అని మండిపడ్డారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుదల చేసి ఏడు రోజులైనా చివరి ఆయకట్టుకు నీళ్లు అందడం లేదని, అధికారులు పట్టించుకోకపోతే తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తంచేశారు. పోలీసులు చేరుకుని రైతులను సముదాయించారు. ఆ తరువాత అధికారులు రైతులతో కలిసి డి-28 మెయిన్ కెనాల్‌ను పరిశీలించారు.

సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఎండిన పొలంలో పశువులను మేపుతున్న రైతు

పశువులకు మేతగా వరి పొలాలు

- కాలువల ద్వారా అందని నీళ్లు.. వట్టిపోయిన బోర్లు
- సిద్దిపేట జిల్లాలో రైతుల పరిస్థితి మరీ దారుణం

చేర్యాల, ఫిబ్రవరి 28 :సాగు నీళ్లు లేక సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రాంతంలో పంటలు ఎండిపోతున్నాయి. ఇటీవల మద్దూరు మండలం నర్సాయపల్లి, కొమురవెల్లి మండలంలోని లెనిన్‌నగర్, కొమురవెల్లి మండల కేంద్రంలో వరిపంటలు ఎండిపోవడంతో పశువులకు వదిలిపెట్టారు. తాజాగా చేర్యాల పట్టణంతోపాటు చేర్యాల మండలంలోని చుంచనకోటలో వరి పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. చుంచనకోట గ్రామానికి చెందిన సుగుణవ్వ తనకున్న రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేయగా బోరుబావి నుంచి నీరు రాకపోవడంతో ఎండిన పంటను శుక్రవారం పశువులు మేతకు వదిలిపెట్టింది. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ'తో రైతులను పలుకరించగా.. గత పదేండ్లుగా పంటలు ఎండిపోయిన దాఖలాలు లేవని, బోర్లు బాగా పోసేవన్నారు. కాంగ్రెస్ వచ్చాక చెరువులు, కాలువలను నింపకపోవడంతో భూగర్భ జలాలు తగ్గి బోర్లు పోయక పంటలు ఎండిపోతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోతుండటంతో చేసేది లేక పశువులకు వదిలిపెట్టాల్సి వచ్చిందని చెప్తున్నారు. చేర్యాల-ఆకునూరు రహదారిలో రైతు అంజనేయులు సైతం ఎకరన్నర వరి పంట ఎండిపోవడంతో పైరును పశువులకు వదిలిపెట్టాడు.

సమావేశంలో మాట్లాడుతున్న కిసాన్ సంఘర్ష సమితి జాతీయ అధ్యక్షుడు సునీలం

బలవంతంగా భూసేకరణ చేయొద్దు

- కిసాన్ సంఘర్ష సమితి జాతీయ అధ్యక్షుడు సునీలం
- తాటిపర్తిలో ఫార్మా బాధిత రైతులతో సమావేశం

యాచారం, ఫిబ్రవరి 28 : రైతుల ఆమోదం లేకుండా ప్రభుత్వం బలవంతంగా వ్యవసాయ భూములు సేకరించొద్దని కిసాన్ సంఘర్ష సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సునీలం సూచించారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం తాటిపర్తి గ్రామంలో ఢిల్లీకి చెందిన న్యాయనిపుణులు, శాస్త్రవేత్తలు ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త కవుల సరస్వతి ఆధ్వర్యంలో శుక్రవారం ఫార్మా బాధిత రైతులతో సమావేశమయ్యారు. భూసేకరణ చట్టాలు, భూములను కాపాడుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిసాన్ సంఘర్ష సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సునీలం మాట్లాడుతూ.. రైతులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు సంఘటితం కావాలని, రైతులు తమ భూములను తిరిగి సాధించుకునేందుకు ఐక్యంగా పోరాడాలని, బలవంతపు భూసేకరణను అడ్డుకోవాలని సూచించారు. మధ్యప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్ ఆరాధన భార్గవ్ మాట్లాడుతూ.. ఆదానీ పవర్ ప్రాజెక్టు భూ సేకరణకు వ్యతిరేకంగా ఎలా ఉద్యమం చేశారో, తిరిగి తమ భూములను ఎలా కాపాడుకున్నారో వివరించారు. శాస్త్రవేత్త బాబురావు, న్యాయవాది శ్రీకాంత్, ఫార్మా వ్యతిరేక పోరాట సమితి సభ్యులు నారాయణ, సామ నిరంజన్, సందీప్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, అచ్చిరెడ్డి, పాపిరెడ్డి, చెన్నయ్య ఉన్నారు.

- పేట-కొడంగల్ భూ సేకరణ సర్వే అడ్డగింత

నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు నిర్మాణం కోసం చేపడుతున్న భూసర్వేను రైతులు అడుగడుగునా అడ్డుకుంటున్నారు. శుక్రవారం ఊట్కూర్ మండలం జీర్ణహల్లి, దంతన్‌పల్లి శివారులో పోలీసులు భారీగా మోహరించారు. ప్రాజెక్టు భూ సేకరణ సర్వే కొనసాగించగా రైతులు అడ్డుకున్నారు. - ఊట్కూర్